# షాక్

డా॥ పులిగిళ్ళ నర్సింగరావు



**గోడమీది గడియారం సరిగ్గా తొమ్మిది కొడుతుండడంతో టి.వి. ఆన్ చేశాడు తిక్క శంకరయ్య.** "అత్త 420-కోడలు840' సీరియల్ అప్పుడే ప్రారంభం అవుతున్నట్లు టైటిల్ సాంగ్ చెబుతోంది. ఆ సీరియల్ దర్శకుడు ఎవరో కాదు, తిక్క శంకరయ్యే. తను రూపొందించిన మొదటి సీరియల్ దర్శకుడిగా తిక్క శంకరయ్యకు మంచి పేరు తెచ్చి పెట్టింది. కోడల్ని చంపడానికి అత్త వేసే ఎత్తుల్ని, ఆ ఎత్తుల్ని చిత్తు చేయడానికి కోడలు వేసే జిత్తుల్ని తిక్క శంకరయ్య ఆ సీరియల్లో విభిన్న కోణాల్లో చూపించాడు. దాంతో ఆ సీరియల్‌ని మహిళా ప్రేక్షకులు ఎగబడి చూశారు. రాత్రి తొమ్మిది కొట్టిందంటే ఏ ఇంట్లో చూసినా, ఏ టీ.వీలో చూసినా 'అత్త 420-కోడలు840' సీరియలే దర్శనమిచ్చేది. ఇతర దర్శకులకు వంద సీరియల్స్ తీస్తే వచ్చిన పేరు ప్రతిష్టలు తిక్క శంకరయ్యకు ఒక్క సీరియల్‌తోనే వచ్చాయి. ఇప్పుడు ఏ మహిళా ప్రేక్షకురాలిని కదిపి మీ ఫేవరైట్ డైరెక్టర్ ఎవరు? అని అడిగితే అందరూ ముక్త కంఠంతో చెప్పే పేరు తిక్క శంకరయ్య.

ఆ రోజుతో ఆ సీరియల్ ఐదు వందల భాగాలు పూర్తి కానుంది. మరో విశేషం ఏమిటంటే ఆ సీరియల్ ముగింపు కూడా ఆ రోజు. పది నిమిషాల్లో సీరియల్ ముగిసింది. మిగతా సమయంలో ఆ సీరియల్లో నటించిన నటీనటులు ఇంటర్వ్యూలు ప్రసారం చేస్తున్నారు. చివరగా తిక్క శంకరయ్య 'తెర' మీద కొచ్చాడు. తన అభిప్రాయాల్ని ప్రేక్షకులతో పంచుకుని 'అత్త 420-కోడలు 840' సీరియల్‌కు బ్రహ్మరథం పట్టిన మహిళా ప్రేక్షకులకు తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ తన ప్రసంగాల్ని ముగించాడు. సీరియల్ ముగియడంతో టీ.వీ. ఆఫ్ చేసి అక్కడినుంచి కదలబోయాడు తిక్క శంకరయ్య. అంతలోనే ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి 'హలో' అన్నాడు.

అవతలి నుంచి ఇంతకు ముందెప్పుడూ వినని కంఠం.

"సార్! నా పేరు పిచ్చి పుల్లయ్య! ఇక్కడ అంతా ముద్దుగా పి.పి. అని పిలుచుకుంటారు. మా ఊరు వెర్రిపాలెం. నేను మీ వీరాభిమానిని" ఫుల్‌స్టాప్ లేకుండా గడగడ వాగేస్తున్నాడు పిచ్చిపుల్లయ్య.

"మీ దర్శకత్వంలో వెలువడిన సీరియల్ 'అత్త 420-కోడలు840' సీరియల్ ఐదు వందల భాగాలు మిస్ కాకుండా చూశాను. సీరియల్ ఇంత త్వరగా ముగిస్తారని ఊహించలేదు సార్!" అంటూ అవతలి నుంచి పి.పి. ఒకటే వాగాడు.

ఆశ్చర్యపోవడం తిక్క శంకరయ్య వంతయింది. కథంటూ లేకపోయినా అత్తాకోడళ్ళ మధ్య జగడాలు సృష్టిస్తూ ఐదు వందల భాగాలు సాగదీసినందుకు ప్రేక్షకులు ఎక్కడ మండి పడతారో అని ఆందోళనకు గురయ్యాడు శంకరయ్య ఇంతవరకూ. పిచ్చి పుల్లయ్య మాటలు విన్నాక తిక్క శంకరయ్యకు ధైర్యం వచ్చింది.

"తొందరగా ముగియడం ఏమిటయ్యా! ఐదు వందల భాగాలు వచ్చింది, దాదాపు రెండు సంవత్సరాలు అయింది కదా ఆ సీరియల్ ఆరంభమై" పిచ్చి పుల్లయ్యనే ప్రశ్నించాడు తిక్క శంకరయ్య.

"ఏమిటో సార్! రెండు సంవత్సరాలు కాదు కదా! రెండు రోజుల్లోనే ప్రారంభమై, ముగిసినట్లు అనిపిస్తోంది" అన్నాడు పి.పి.

'అభిమానం దుంపతెగ' మనసులోనే అనుకున్నాడు తిక్కశంకరయ్య.

కాసేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ దూసుకొచ్చింది మరో ప్రశ్న పి.పి. కంఠం నుంచి.

"సార్! మీ కొత్త సీరియల్ ఎప్పుడు ప్రారంభమవుతుంది?"

"ఒకటి తీస్తున్నాం. పూర్తి కావచ్చింది. త్వరలోనే ప్రారంభం కానుంది. నిదానంగా తిక్క శంకరయ్య సమాధానం."

"అలాగా! థ్యాంక్యూ సార్!" పిచ్చి పుల్లయ్య కంఠంలో ఉత్సాహం

"దేనికి? థ్యాంక్స్ ఎందుకయ్యా?" తిక్క శంకరయ్య కంఠంలో ఆశ్చర్యం!

"మీరు తీస్తున్న ఆ సీరియల్ మా కోసమే కదా సార్!"

"ఓ... అందుకా... సరే!"

"సార్! ఇంతకీ కొత్త సీరియల్ పేరేమిటి?" పి.పి. కంఠం నుంచి మరో ప్రశ్న.

'షాక్' తిక్క శంకరయ్య సమాధానం.

"వామ్మో!...బావుంది సార్! మీరు మాకు త్వరలోనే 'షాక్' ఇవ్వబోతున్నారన్నమాట!"

"అవును."

"మీ కొత్త సీరియల్ భారీగా ఉండాలి సార్! చాలా భాగాలు రావాలి, మొదటి సీరియల్లా అంత త్వరగా మునిగిపోకూడదు."

"తప్పకుండా! మీలాంటి వీరాభిమానుల్ని దృష్టిలో పెట్టుకునే ఈ సీరియల్ రూపొందిస్తున్నాం. రెండు సంవత్సరాల సీరియల్ కూడా అప్పుడే ముగిసింది అన్నావుగా, ఇప్పుడలా అనవు."

"మీకు మరోసారి థ్యాంక్స్ సార్!"

"అప్పుడేనా, నీకు మరో రెండు కొత్త విషయాలు చెప్పాలి!"

"ఏమిటి సార్ అవి?"

"ఈ సీరియల్ పేరు క్రింద కొత్తగా ఒక కూపన్ పెడుతున్నాం వెరైటీ కోసం!"

"ఏమిటి సార్ అది?"

"మీ కోసం...మీ పిల్లల కోసం' అని."

"దాని అర్థం ఏమిటి సార్?"

"సస్పెన్స్. చూస్తూ ఉండండి. ముందు ముందు మీకే తెలుస్తుంది."

"ఇంకో విషయం ఏమిటి సార్?"

"ఇది డైలీ సీరియల్ కాదు. వీక్లీ సీరియల్!"

"ఎన్ని భాగాలు వస్తుంది సార్?"

"ఒక వెయ్యి నూట పదహారు భాగాలు. అంటే ఖచ్చితంగా ఇరవై రెండు సంవత్సరాలు. మీరు చూడొచ్చు. మీ పిల్లలు చూడొచ్చు."

"సార్! మీరు పేరు క్రింద ఆ క్యాప్షన్ ఎందుకు పెట్టారో నాకు ఇప్పుడర్థమైంది. ఓ చిన్న రిక్వెస్ట్ సార్!" పిచ్చి పుల్లయ్య గొంతులో చిన్న అర్థింపు."

"సరే అడుగు" దేవుడు భక్తుడితో వరమిస్తూ ఏం కావాలో కోరుకో అన్న లెవల్లో చెప్పాడు తిక్క శంకరయ్య.

"అసలు కథ ఎలా ఉంటుందో కొంచెం చెబుతారా సార్!"

"ఇలాంటివి చెప్పకూడదయ్యా! రహస్యంగా ఉంచాలి. చూసి తరించాల్సిందే. సరే! నీవు నా వీరాభిమానివి అన్నావు కదా! కొంత చెబుతాను.

కథంగా ఓ కుర్రాడి చుట్టూ తిరుగుతుంది. ఇందులో రెండు హత్యలు ఉంటాయి. సీరియల్ మొదటి భాగం నాడే ఓ హత్య జరుగుతుంది. దాన్ని కళ్ళారా చూస్తాడు ఆ కుర్రాడు. 'షాక్'కు గురవుతాడు. మెంటల్ ఎఫెక్ట్ వస్తుంది. మధ్యలో అంతా ఆ కుర్రాడికి షాక్ ట్రీట్మెంటల్లు ఇప్పించడంతో వగైరా వగైరా ఉంటుంది. ఫలితం మాత్రం శూన్యం. మళ్ళీ రెండో హత్యను కళ్ళారా చూసన కుర్రాడు 'షాక్' నుంచి బయటికొస్తాడు. కథ సుఖాంతం అవుతుంది" అంటూ చెప్పడం ముగించాడు తిక్క శంకరయ్య.

"అసలు ఆ రెండో హత్య ఎప్పుడు ఉంటుంది సార్?" తన ధర్మ సందేహాన్ని వ్యక్తం చేశాడు పి.పి.

"ఒక వెయ్యి నూట పదహారో భాగంలో."

"అంటే ఇరవై రెండేళ్ళు తర్వా...!" మధ్యలోనే ఆగిపోయింది పిచ్చి పుల్లయ్య గొంతు.

తిక్క శంకరయ్య ఆందోళనకు గురయ్యాడు, ఆవతలి గొంతు మధ్యలోనే ఆగిపోవడంతో. అతని మనసు ఏదో కీడును శంకించింది.

"హలో...హలో..." అరుస్తూనే ఉన్నాడు తిక్కశంకరయ్య.

అవతలి నుంచి ఉలుకు పలుకు లేదు. కాసేపటి తర్వాత 'దబ్'మన్న శబ్దం వినిపించింది. యాభై కిలోల బస్తా ఏదో క్రింద పడ్డట్టు.

ఆ పడింది ఏమిటో అర్థమైంది తిక్క శంకరయ్యకు. మెల్లగా ఫోన్ పెట్టేశాడు. తన కథ తెరపైకి కూడా ఎక్కకముందే ఒకరికి 'షాక్' ఇచ్చేసింది. ఇంక చాలా 'షాక్'లు ఇవ్వాలి కదా, అనుకుంటూ వెళ్ళి స్క్రిప్టు మీద పడ్డాడు దర్శక మహాత్ముడు తిక్కశంకరయ్య. ❀


## పుస్తకాలు

### "బాల కుటీరం"

రచయిత్రి : బాలసాహితీ రత్న శ్రీమతి ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి

పేజీలు : 62 వెల రూ. 40/-

ప్రతులకు : మనోహరి, కేర్/ఆఫ్ శ్రీమతి ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి, ఇం.నం. 24.4.30/1, విష్ణుపురి, సఫిల్‌గూడ, హైదరాబాద్ 500 047.




ప్రముఖ బాల కథారచయిత్రి "బాల సాహితీరత్న" శ్రీమతి ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి కలం నుండి వెలువడిన మరో బాల కథాసంకలనం "బాల కుటీరం".

ఈ పుస్తకంలోని కథలు విజ్ఞానాత్మకంగా నీతిదాయకంగా వున్నాయి.

పిల్లలు ఆడుకున్నా, పాడుకున్నా బాగుంటుంది కానీ దేవుడితో ఆటలాడితే ఏం బావుంటుంది? "దేవుడితో ఆటలాడే సుబ్బయ్య" కథ చదివితే ఆ ఆట ఏమిటో తెలుస్తుంది. దేముడు ఆ ఆటకి బదులెలా చెప్పాడో తెలుస్తుంది.

జ్ఞాని, అజ్ఞాని, మూర్ఖుడు కథ పిల్లల్లో విజ్ఞానాన్ని, ఆలోచనాశక్తిని పెంపొందింప చేస్తుంది.

దానగుణం కంటే దాన లక్ష్యం మిన్న అన్న సూత్రాన్ని సూచిస్తూ రచయిత్రి "దాన లక్ష్యం" అన్న కథలో చెప్పారు.

కొందరు పిల్లలకు దెయ్యాల కథలు అంటే ఇష్టం. ఓ పక్క భయపడుతూనే వింటారు. అలాంటివారికి "కొరివి దెయ్యం - కోమటి బెల్లం" అన్న కథ నచ్చుతుంది.

పిల్లలలో మానవత్వం, దయాగుణం పెంపొందించే చక్కని సూచనతో ఈ కథను నింపారు రచయిత్రి "మానవత్వం" కథలో.

ఈ పుస్తకంలో ఇంకా ఎన్నో కథలు ఇటు పిల్లల మనస్సులను, పెద్దల మనస్సులను ఆకట్టుకుంటాయి.

మొత్తం ఇరవై ఆరు కథలు కలిగిన ఈ పుస్తకం చదివితే బాల సాహిత్యం పట్ల గల అభిరుచిని అభినివేశం అర్థం అవుతుంది.

వీరు మరిన్ని బాలల పుస్తకాలు వెలువరించాలని, వెలువరిస్తారనీ ఆశిస్తున్నాను.

**- డి. పంకజ్ మల్లిక్**